తెల్లదొరల పాలన పోయిందనీ, షాపుకి సీమదొరలు రావడంలేదనీ వాడికి కోపంగా ఉన్నదని విశాలాక్షికేం తెలుసు ?!

అతనికే గాని శాసనాధికారం ఉంటే సీమదొరలూ, ఐ.సి.యస్ ఆఫీసర్లూ, మహారాజులూ తప్పించి వేరెవ్వరూ తన షాపుకి రావడానికి వీల్లేదని శాసించగలిగినవాడు ఆ షాపువాడు.

ఆ సంగతి విశాలాక్షికి తెలీదు ఆమెతండ్రికీ తెలీదు. కాని, ఆ షాపు ముఖం చూస్తేనే వెళ్లాలనిపించలేదు.

“ఒద్దు నాన్నా ! అది గొప్పషాపూ.”

“ఇంతదూరం వచ్చేం కదా ! పోయి చూద్దాం రా.”

షాపువాడే కాదు కనకారావు. వాడి నౌఖర్లందరూకూడా కనకారావులే.

అమాంతంగా కాళ్లువచ్చి నడుచుకొచ్చిన చెత్తడబ్బాని చూసినట్టుగా వాళ్ళంతా తనతండ్రిని చూశారని విశాలాక్షికి తెలుసు.

విశాలాక్షిని వాళ్ళంతా ఏ దృష్టితో చూశారో కూడా విశాలాక్షికి తెలుసు.

విశాలాక్షికి అవమానం భరించే శక్తి లేదు.

శక్తిలేకపోయినా భరించి తీరాలి.

విశాలాక్షి దహించుకుపోతోంది.

“సిల్కు-చీరలు కావాలా ?” అని అడిగేడు షాపువాడు.

ఆ మాటల్లో వెటకారం లేదన్న వాళ్ళ గుడ్లు పీకేస్తాను.

అందుకు, విశాలాక్షి తండ్రి :

“అబ్బే...” అని ఆరంభించేడు.

ఆ “అబ్బే”ని ఉచ్చరించడంలో ఎందుకంత దౌర్భాగ్యాన్ని ధ్వనించడం ?

అందులోనే ఎందుకంత సిగ్గు ? ఎందుకంత భయం ?

“అబ్బే... నేతచీరలు... తెల్లవి... కాస్త జరీ... చూపిస్తే చాలు...

వద్దు వద్దు. పోదాం.

అని ఎలా చెప్పడం ?

సూదిమేకులమీద, ముళ్ళడొంకలమధ్య నిల్చున్నట్టుగా నిల్చొంది.

ఇంతలో, వాడు చీరలమేటిలోంచి పైకి తీసేడు.

జరీ! జరీ! జరీఅంచు తెల్లచీర!

తాచుపాముని చూసినట్లుగా జడుసుకొంది విశాలాక్షి.

దూరంగా, దూరంగా, ఈ విషాన్ని దూరంగా తీసేయండి.

"ఎంతండీ?"

"ఇరవై రెండు"

అతను జంకిజంకి, భయపడిభయపడి,

"కొంచెం...కొంచెం అయినా...తగ్గదంటారా?" అనేసరికి—

"ఇదేం శుక్రవారం సంతకాదు, బేరాలాడ్డానికి" అనే మాటలతో కొట్టేడు వాడు.

దెబ్బ తగలగానే కదలడానికి భయపడ్డ నాన్న;

"పోనీ...మరోరకం...కొంచెం తక్కువ ఖరీదువి..." అనేలోపునే వాడు,

"లేవండీ బాబుగారూ, లేవు" అని అవమానకరమైన అతిమర్యాదతో అన్నాడు.

షాపంతా అతి నిశ్శబ్దం.

వాడు వెటకారంగా నవ్వనైనా నవ్వలేదు.

కనకారావులు నవ్వకుండానే అవమానించగలరు.

ఈ కనకారావుల నెత్తురు మూడ్డం ఎప్పుడు?!

అందులో నా తెల్లచీర తడపడం ఎప్పుడు?!

క్రోధజ్వాల విశాలాక్షిని దహించేస్తోంది.

షాపుబైట —

దెబ్బతిన్న గొడ్డులా కనిపించే ఈ వృద్ధుడెవ్వరు?

"నేవద్దంటే ఎందుకు విన్నావు కాదు నాయనా!"

"అంత ఖరీదు ఉంటాయనుకోలేదే."

నెత్తురే ఖరీదుగా ఇచ్చినా దొరకని వస్తువులు!

దహించుకుపోయే విశాలాక్షిని ముంచేయడానికి వస్తోంది, ఉప్పెన.

ఒక్క జరీఅంచు తెల్లచీర !

కుక్కి మంచంలో కూలబడి కూర్చొన్న విశాలాక్షి కొట్టుకుపోతూ చూస్తోంది.

ఇంట్లో,

కష్టపడి కష్టపడి వెలిగే "తుపానుదీపం"; ఫిజిక్స్ పుస్తకం చిక్కుల్లో ఇరుక్కున్న అన్నయ్య; పదమూడో ఎక్కం గతుకుల్లో పడిలేచే తమ్ముడు; నిద్దర పట్టనితల్లి; అగ్గిదొరకని తండ్రి; ఏడవకుండా ఉండని చిన్నతమ్ముడు.

విశాలాక్షికి ఏడుపు వస్తోంది.

అన్నయ్యకి ఫిజిక్స్ పాఠం అర్థంకాదు. తమ్ముడికి పదమూడో ఎక్కం చస్తేరాదు. అమ్మకి నిద్దరపట్టడం అనేది ఉండదు. నాన్న అగ్గి కోసం వెతుకుతూనే ఉంటాడు. చిన్నతమ్ముడు ఏడవక తప్పదు. ఈ వెలగ లేని దీపం ఎంతోసేపు వెలుగదు.

—నే నేడవను,

అనుకొన్న విశాలాక్షికి మరింక ఆగకుండా ఏడుపువస్తోంది.

కుక్కిమంచంలో కూలబడి కూర్చొన్న ఈ పదహారేళ్ళ ఆడపిల్ల ఈ విశాలాక్షి ఏకధారగా, వరద వరదగా ఏడుస్తోంది.

ఇది మెరుపులేని మబ్బు. ఇది తెరిపిలేని ముసురు, ఇది ఎంతకీ తగ్గని ఎండ. ఇది ఎప్పటికీ తెల్లవారని చీకటిరాత్రి. ఇది గ్రీష్మం. ఇది శిశిరం. ఇది దగ్ధంచేసే దవానలం. ఇది రెక్కల్ని రాల్చేసే నైరాశ్యం–

ఒక్కటి ! ఒక్కటే సుమండీ ! ఒక్క జరీఅంచు తెల్లచీర !

ఇద్దరు పిల్లలు

చంద్రుణ్ణి కొనుక్కోనక్కర్లేదు. చుక్కల్ని కూడా కొనుక్కోనక్కర్లేదు.

అందుచేతనే చేతిని ఎత్తుకొన్న కొడుక్కి వాటిని చూపించి ఊరుకో బెడుతోంది ఆవిడ, సాయంకాలం ఆరున్నర గంటల ప్రాంతాన, ఇంటిముంగిట్లో అంటే వీధిలో నిల్చొని.

ఉత్తర దక్షిణాలకి పోయే సందు 'పొడావుగా' ఉంది. అట్టే వెడల్పుగా మాత్రం లేదు. మ్యునిసిపల్ దీపాలు పేరుకి తగ్గట్టుగా వెలుగుతున్నాయి. పొట్టిగా ఉండే పెంకుటిళ్ళ మీంచీ, తాటాకుల కప్పులమీంచీ, మురికి వీధిలోంచీ చలిగాలి మంద మందంగా వీస్తోంది. నడిరోడ్డుకి సూటిగా మీదకి నిల్చిన చంద్రుడు వంకరగా ఒరగి చిరుమబ్బు పోకదాన్ని విదల్చుకొని బైటపడ్డాడు.

చలికి పైట దగ్గరగా కప్పుకొని, కుడిచేత్తో ఆకాశంవైపు చూపిస్తూ,

“అడుగో చందమామ! చూడమ్మా, చూడు” అంది ఆవిడ.

పిల్లడు తలెత్తి చూసి ఏడుపు ఆపేడు.

ఆ అబ్బాయి ఏడాదికంటె హెచ్చు వయసువాళ్లా లేడు. మొక్కుబడి ఏడైనా ఉండేదేమో, జుట్టంతా అట్టలుకట్టి ఉంది, వంటిమీద బట్టలూ, వంట్లో జవసత్వాలూ లేవు. కొన ప్రాణాలు కళ్ళల్లో ఉన్నాయి.

ఆ పిల్లడికి “నిజంగా మూడేళ్లున్నా”యంటే ఆ మాట నిజమేకాని నమ్మడానికి వీలుగా లేదు.

కొందరు జీవచ్ఛవాల్లా ఉంటారు. ఆ పిల్లడు అలానే ఉన్నాడు.

ఆ తల్లికూడా అలానే ఉంది.

“అవిగో చుక్కలు! చూసేవా ఎలా మెరుస్తున్నాయో” అంది ఆవిడ, చుక్కల్ని కూడా చూపిస్తూ.

చందమామని చేరదీసుకోవాలనీ, చుక్కలకి చేరువగా చేరిపోవాలనీ ఉండేది ఆవిడకి.

అది ఒకనాటి విషయం.

అదంతా గడిచిన దినాల సంగతి.

ఇప్పుడావిడ చందమామే కావాలందా? చుక్కల్ని తీసుకొచ్చి ఇస్తేనేగాని వీల్లేదందా?

అదేం లేదు.

చంద్రుడెలానూ దగ్గరగా రాడనీ, చుక్కలకి దగ్గరగా వెళ్ళడం ఎలానూ ఉండదనీ ఆవిడకి స్పష్టంగా తెలుసు.

తల ఎత్తి ఆకాశంలోకి చూసి నవ్విన పిల్లడు తలదించి తిరిగి ఏడవక తప్పదని కూడా ఆవిడకి తెలుసు.

ఆ కుర్రవాడు అదే రీతిగా చేసేడు మరో క్షణానికి.

ఏడుస్తూ ఏదో మాట మాత్రం అస్పష్టంగా హీనంగా అంటున్నాడు.

"ఉండ్రా వచ్చినాడా! అన్నయ్య వెళ్ళిరావాలా? ఊరికే ఏడుస్తే ఒస్తదా?" అని ఆవిడ కేకలు వేసింది.

ఆ "వచ్చేది" ఏడుస్తే వస్తుందో రాదో ఆ కుర్రవాడికి తెలీదు. ఆ కుర్రవాణ్ణి ఎలా సముదాయించడమో ఆవిడకి తెలీదు. తెలిసినా సముదాయించే ఓపిక లేదు. అందుచేత వాణ్ణొక్క మొత్తు మొత్తి ఇంట్లోకి తీసుకుపోయింది.

సరిగ్గా అదే సమయంలో ఆ తల్లి కొడుకే, ఏడేళ్ళవాడు–నల్లగోపాలం ఆ ఇంటికి కొంత దక్షిణంగా ఆ వీధిలోనే, అమ్మవారి గుడి దగ్గర, వేప చెట్టుకింద నిల్చొని, ఆఖరిసారి అడిగినట్టుగా "అయితే, ఇవ్వవుకదరా" అని అడిగేడు.

గోపాలానికి ఎదురుగా నిల్చున్న కుర్రవాడు, అదే వయసువాడు– ఎర్ర సుబ్బడు – పోయే ప్రాణాల్ని ఓగించి పట్టుకున్నట్టుగా, చేతులు బిగించి గుండెలకి హత్తుకున్నాడు "బొంబాయి బన్ను"ని.

వేప చెట్టుకి ఎదురుగా టెయిలర్ దుకాణంలోని లాంతరు వెలుగు వేపచెట్టు నీడలోనికి రావడానికి జంకుతోంది. వేపచెట్టు ఆకులు చలికాలానికి

పల్చపడ్డాయే కాని చంద్రుణ్ని మాత్రం అటకాయించేస్తున్నాయి. చెట్టు మొదట్లో బొమ్మవంటి గుళ్ళో నిశ్చలంగా నిల్చొన్న అమ్మవారి ముందు వెలిగే నూనె దీపపు వెలుగు ఆ ఇద్దరి పిల్లలకీ అందడం లేదు. గోపాలం నల్లటి నలుపనీ, కళ్లు మాత్రం పెద్దవనీ, నోరు చిన్నదనీ, ముక్కు ఎత్తనీ ఆ చీకట్లో చూస్తే తెలీదు. లాంతరు వెలుగులోకి లాక్కొచ్చి చూస్తే ఎర్ర సుబ్బడు రాగిచెంబు రంగులో ఉంటాడనీ, ముఖం సున్నాలా ఉంటుందనీ, కళ్లు చిన్నవనీ, నోరు పెద్దదనీ, ముక్కు ఎర్ర జీడిపండులా ఉంటుందనీ తెలుస్తుంది. బాగా ఎత్తుగా ఉన్న అంతటి చెట్టుకింద వాళ్ళిద్దరూ చాలా పొట్టిగా, పల్చగా, చిన్నగా, చిన్న కొయ్యబొమ్మల్లా మాత్రం కనిపిస్తున్నారు.

పాదు ఆట్టే సందడిగా లేదు. ఉండీ ఉడిగీ ఒకడూ అరా చొప్పున మనుష్యులు నిశ్శబ్దంగా నడుచుకొని పోతున్నారు. పిల్లల్ని ఎవ్వరూ గమనించినట్టుగా లేదు. గమనించినా వాళ్ళిద్దరి మధ్యా ఘర్షణ జరుగుతోందని తెలిసికొన్నట్టుగా లేదు. తలకి ముసుగు వేసుకొని, దగ్గుతూ దగ్గుతూ వచ్చిన ఓ ముసలాయన మాత్రం వాళ్ళకి దగ్గరగా వచ్చి ఆగి, పరీక్షగా "ఎవరబ్బాల్నాయినా? సీకటడిపోయింది. పొండి ఇళ్ళకిపొండి" అన్నాడు. వాళ్లా మాటలు విన్నట్టుగా లేదు, మరో మనిషి వచ్చేడని చూసినట్టుగానే లేదు. ముసలాయన దగ్గుకొంటూ వెళ్ళి చంకనున్న గోనెవిప్పి అమ్మవారి గుడి పక్క చప్టామీద పరుచుకొని కీళ్లు నొవ్వకుండా నెమ్మదిగా జాగ్రత్తగా పడుక్కున్నాడు. బొంబాయి బస్సులనేవి ఉంటాయని ముసలాయనకి తెలీదు.

* * *

చంద్రుణ్ని చుక్కల్ని కొనుక్కోనక్కరలేదు. బొంబాయి బస్సుల్ని మాత్రం కొనుక్కోవాలి.

అయితే ఆ బొంబాయి బస్సు ఎర్రసుబ్బడికి కొనకుండానే వచ్చింది. మొన్నీమధ్య సుబ్బడి బావ—అప్ప పెనిమిటి—బొంబాయినుంచి బండీ దిగేడు. దిగి ఇంట్లో అడుగుపెడుతూనే, పెట్టె తెరిచి, పైకితీసి బహూకరించేడు,—మరదలి కొక 'సాటిన్ ఫ్రాకూ' బావమరది కొక 'బొంబాయి బస్సూ'ను.

బొమ్మనీ, బొమ్మని తెచ్చిన బావనీ, బావని పెళ్ళాడిన అప్పనీ చూసుకొని బ్రహ్మానందభరితుడైన ఎర్రసుబ్బడు ఇంట్లో అటూఇటూ ఎగిరెగిరి ఎగిరెగిరి తరువాత ఒక్కదూకు దూకేడు నల్లగోపాలం ఇంటికి.

ఎదటింటి ఎండు వెంకడుగాడు, పక్కింటిదుక్క బుజ్జాయిగాడు, వెనకింటి దొంగబాబిగాడు, నూతిపక్కింట్లో నూనె జిడ్డుగాడు, జామిచెట్టింట్లో జామకాల సీత—వీళ్ళంతా సుబ్బడి స్నేహితులే. కాని ఆ బొమ్మని వాళ్ళెవరికీ చూపించకుండా, సూటిగా, రామబాణంలా ఆ నల్లగోపాలం ఇంటికే ఎర్రసుబ్బడు ముందుగా పరిగెత్తడానికి కారణం ?

వాళ్ళిద్దరూ ప్రాణస్నేహితులని ఆ వీధిలో అందరికీ తెలుసు. సుబ్బడి తండ్రికీ, గోపాలం తండ్రికీ ఒకే "మర"లో నౌఖిరీ. ఆ తండ్రులిద్దరూ మర్లోకి తాగడానికీకూడా కలిసే వెళ్తూంటారు. వాళ్ళఇళ్ళు కొంచెం దూరదూరంగా ఉన్నా ఒకే వీధిలో ఉన్నాయి. వారి భార్యలు అప్పు సప్పులకి ఒకరిళ్ళకొకరు వెళ్ళినప్పుడు ఒకరిదెబ్బ లొకరికి చూపించుకోడం వారికి మామూలు.

గోపాలానిదీ సుబ్బడిదీ ఇంచుమించు ఒకే వయసు. వాళ్ళిద్దరిదీ. ఒకే స్కూల్లో ఒకే క్లాసు. క్లాసుకి ఎప్పుడూ ఆలస్యంగా వెళ్ళేది వాళ్ళిద్దరే. ఒకటో ఎక్కం, రెండో ఎక్కం, పదో ఎక్కం తప్పించి మరే ఒక్కఎక్కం కూడా రానివాళ్లు ఆ క్లాసుకి వాళ్ళిద్దరే.

పెద్దలైనా, పిన్నలైనా ఇటువంటి పరిస్థితుల్లో స్నేహితులవక తప్పరు.

కాని, ఓ రామయ్యగారికి జామిచెట్టే లేకపోయినట్లయితే వాళ్ళిద్దరూ ప్రాణస్నేహితులవక పోయేవారేమో.

స్కూలుకి దగ్గర్లో రామయ్యగారి ఇల్లుంది. ఇంటిపక్క రామయ్యగారి జామిచెట్టుంది. జామిచెట్టుమీద రామయ్యగారి పంచప్రాణాలూ ఉంటాయి.

కలకల్లాడుతూ కల్పవృక్షంలా కనిపించే జామిచెట్టునిండా నవనవలాడుతూ పళ్లుపళ్లు ఎన్నోపళ్లు ఉన్నప్పటికీ, బడిపిల్లలకి అదొక వెల్‌కమ్ అడ్రస్‌లా ఉన్నప్పటికీ, ఏ ఒక్క బడిపిల్లడూకూడా ఆ పళ్ళని చూసి ఆనందించడం తప్ప తిని ఆనందించకపోడానికి రెండు కారణా లున్నాయి.

ఒకటి : రామయ్యగారి తోటమాలీ యమకింకరుళ్ళా ఉండడం.

రెండు : రామయ్యగారు కాలయముళ్ళా ఉండడం.

నల్లగోపాలంమాత్రం చూసిచూసి ఓ రోజున ధైర్యంచేసేసేడు.

దిగువని ఎర్రసుబ్బుడు రాలేసపళ్ళని జోరుజోరుగా ఏరుతున్నాడు. పైనుంచి నల్లగోపాలం పళ్ళని తెంపి పారేస్తున్నాడు. ఇద్దరూకూడా యముడూ, కింకరుడూ ఇంట్లోంచి వెళ్ళడమే చూసేరుకాని రావడం గమనించలేదు. వాళ్లుమాత్రం వస్తూనే చూసింది వీళ్ళనే. వస్తూనే చెరో కణ్ణీ పట్టుకొని చావగొట్టి చెవులు మూసేరు. ఆ దినం రామయ్యగారికీ రావణాసురుడికీ తేడా తొమ్మిదితలల్లో మాత్రమే.

కాలయముడు; కల్పవృక్షం; చావుదెబ్బలు.

నల్లగోపాలం, ఎర్రసుబ్బుడూ ప్రాణస్నేహితులవడానికి అవీ కారణాలు. అవి మాత్రం సిమెంటు కాంక్రీటువంటి కారణాలు.

ఈ స్నేహితులకి—

బఠానీలు, పకోడీలు, ఉసిరికాయలు, రేగుపళ్లు, వేయించెనగలు, గాలిపడగలు, పలకపుల్లలు, రబ్బర్లు, తెల్లకాయితాలు, బొంగరాలు, గోటికాయలు వగైరాలు-అన్నీకూడా వారి సమిష్టి ఆస్తులు. అవి ఒకరికి ఉన్నట్లయితే రెండోవారికున్నూ-డా ఉన్నట్లె లెక్క.

బొమ్మ బస్సుని చూసినప్పుడుకూడా సుబ్బుడెంత సంతోషించేడో గోపాలం అంతగానూ సంతోషించేడు.

చాలా చిన్నది బొంబాయి బస్సు. ఎర్రటి రంగుతో మెరుస్తూంది. అంత చిన్నబొమ్మలోనూ రెండు అంతస్తులు కనిపించేలా తయారుచేసేరు. డ్రైవరు టన్ డ్రైవరు. కిటికీలవద్దర ప్రయాణీకులూ, గుమ్మందగ్గర కండక్టరూ మాత్రం రంగు రేకుమీద రంగుబొమ్మలు. "కీ" ఇస్తే బస్సు పరిగెడుతుంది.

"బలే బలే బలేగుందిరా" అన్నాడు నల్లగోపాలం.

కాని సుబ్బుడి వ్యవహారం బలేగా ఉందా ?

దీనికి "కీ" ఇలా ఇవ్వాలి. కుడివైపుకి తిప్పాలి. వెనక చక్రాలు గిర్ గిర్‌మని తిరక్కుండా ఇలా పట్టుకోవాలి.

అని ఆ బొమ్మకి "కీ" ఎలా ఇవ్వడమో చూపించేడు సుబ్బుడు.

ఇలా ఒదలాలి.

బస్సుని ఒదిలేడు.

జరజర శబ్దం చేస్తూ వెళ్ళి గోడని గుద్దేసి ఆగిపోయింది బస్సు.

"అడ్డేదీ లేపోతే చాల్దూరం వెళుతుంది తెల్సా!" అన్నాడు సుబ్బడు.

బస్సుని గోడకి ఇవతలవైపుకి మళ్ళీ తిప్పి వదిలేడు.

జరజరా మళ్ళీ పరిగెత్తింది బస్సు. చివరకి ఆగింది.

దాన్ని చేతిలోకి తీసుకొని చెపుతున్నాడు సుబ్బడు.

చూసేవా, ముందు కూర్చున్నాడు డ్రైవరూ. మా బావా అలాగే కూర్చుంటాడు. మరో తమాషారా, గోపాలం! ఇది మేడబస్సు. "మనూళ్లో ఇటువంటి దేదీ చూపించు చూదాం!" బొంబాయిలో అన్నీ ఇలాటి బస్సులే. బొంబాయి మా బావతో "నేనూ వెళ్తాన్ తెల్సా!"

ఆ మాటలు చెప్పడంలో, చెపుతూన్నప్పుడు ఆ కళ్ళు తిప్పడంలో, ఆ బొమ్మని చేత్తో గట్టిగా పట్టుకోడంలో, "కీ" ఇచ్చి దాన్ని పరిగెత్తించి నప్పుడు గోపాలం ఎక్కడ లాక్కుంటాడో అని తనే ముందుపరిగెత్తి దాన్ని తీసి గుండెలకి అదుముకోవడంలో మచ్చుకొక్కసారైనా దాన్ని గోపాలం చేతికి ఇవ్వకపోడంలో—

సుబ్బడి ఉత్సాహమే కాకుండా, "ఇది నాది. దీన్ని నేనే వాడాలి" అనేభావంకూడా వ్యక్తమవుతోంది. కొద్దిసేపట్లో గోపాలానిక్కూడా అంతా స్పష్టమయింది.

"ఈ బొమ్మ వీడు నాకివ్వడు."

అని చాలా ఖచ్చితంగా, రెండు రెళ్లు నాలుగులాగ, సూర్యుడు ఉదయించి అస్తమించుట్లాగ తెలిసింది గోపాలానికి.

"నేనోసారి 'కీ' ఇస్తా నిలా ఇవ్వరా" అని అడిగేసేడు.

అప్పుడు సుబ్బడు బస్సుకి 'కీ' ఇవ్వబోతున్నాడు. ఇవ్వబోతూ ఆగేడు.

ఇస్తాడా ఇవ్వడా? ఇస్తాడా ఇవ్వడా? ఇస్తాడా ఇవ్వడా?...

"కీ" ఇవ్వడం మొదలుపెట్టేడు సుబ్బడు.

"మా బావా...('కీ' తిప్పేడు)...మరి ...(మళ్ళీ తిప్పేడు)...మా బావొచ్చి మరి...(మరోసారి తిప్పేడు)...కొప్పడతాడ్రా..."

అని ఇంకా ఏవో నసిగేడు సుబ్బడు, కరకరమని 'కీ' ఇచ్చేస్తూ సాకులు చెప్తున్నాడు సుబ్బడు !

గోపాలానికి అసహ్యం వేసింది.

"పోన్లేరా ఒద్దులే" అనేశాడు.

గోపాలం ఉత్సాహం అంతా చచ్చిందంటే అర్థం ఉంది. కాని సుబ్బడి హుషారంతాకూడా ఎందుకు సన్నగిల్లింది ? ఏదో తప్పుచేసినట్టు ఎందుకు సిగ్గేసింది ? మరో అయిదునిమిషాలైనా ఉండలేకపోయేడు అక్కడ. తిరిగి ఇంటికి మెల్లిగా బయల్దేరేడు.

బయల్దేరబోయేడు.

ఇంతలో ఎదురుగా గోపాలం తమ్ముణ్ని ఎత్తుకొని గోపాలం తల్లి వచ్చింది.

గోపాలం తమ్ముడు అందరికీ తమ్ముడే.

బొంబాయి బస్సుని చూడగానే, తమ్ముడూ—నిజంగా చాలా కాలానికి—నవ్వేడు.

"ఏంవిరా సుబ్బడూ, ఏవిట్రా ఆ చేతిలోదీ ?" అని అడిగింది 'తమ్ముడి' తల్లి.

ఎడంగా నిల్చొన్న నల్లగోపాలం నిశ్శబ్దంగా నిల్చొని తీక్ష్ణంగా చూస్తున్నాడు.

"బస్సు ! బొంబాయి బస్సు!" అన్నాడు సుబ్బడు, తలవంచుకొని చేతిలో బొమ్మవైపు చూస్తూ.

బావ రావడం, బొమ్మ తేవడం మొదలైన విషయాలన్నీ నెమ్మదిగా ఒకటీ ఒకటీ తెలుసుకొంది గోపాలం తల్లి.

తమ్ముడు ఈ లోపున "బచ్చు బచ్చు" అంటూ చెయ్యి జాస్తూనే ఉన్నాడు.

చూస్తున్నాడు గోపాలం. గోపాలం చూస్తున్నాడు.

తనకయితే ఇవ్వలేదు. తమ్ముడికైనా ఇస్తాడా ఇవ్వడా ?

తమ్ముడికే కాని ఇవ్వకపోతే సుబ్బడితో ఆ క్షణంలోనే జట్టు విప్పేసి తీరుతాడు గోపాలం.

సుబ్బడుకూడా చూస్తున్నాడు. వేగిరం ఊడాయించేద్దామని చూస్తు న్నాడు. కాని కాలు కదలడంలేదు. ఇప్పుడు ఆమడ దూరానికి వినబడేలా గుండెలు కొట్లాడుతున్నాయి.

తమ్ముడు "బచ్చు బచ్చు" అని అంటూనే ఉన్నాడు.

ఎత్తుకున్న పిల్లణ్ని నేలని కూర్చోబెడుతూ "ఏదీ ఆ బొమ్మ వీడికో సారి! ఇద్దూ" అంది గోపాలం వాళ్ళ అమ్మ.

అప్పటి మట్టుకు బొమ్మని ఇవ్వక తప్పింది కాదు. ఆవిడక్కూడా ఏదో సాకుచెప్పే సాహసం లేకపోయింది సుబ్బడికి.

కాని మర్నాడు మాత్రం 'గోపాలం వాళ్ళ' ఇంటికి వెళ్ళడం మానే శాడు. తరువాత రోజు ఆ తరువాత రోజుకూడా అంతే చేశాడు. స్కూలుకి గోపాలం కంటె ముందుగా వెళ్తున్నాడు. క్లాసులో గోపాలానికి ఎడంగా కూర్చుంటున్నాడు. స్కూల్ నుంచి తిరిగి రావడంలో గోపాలాన్ని తప్పించు కొందికి వీలులేకపోతోంది. గోపాలంతో నడుస్తున్నప్పుడు మాత్రం నిశ్శ బ్దంగా నడుస్తున్నాడు. రెండోరోజు సాయంకాలం కొంత దూరం ఇంటి వైపు నడిచేక, జేబులోంచి బటానీలు తీసి "తీసుకోరా" అన్నాడు గోపాలం.

ఎలా ఊహించగలిగేడో కాని సుబ్బడు ఆ బటానీలు పుచ్చుకోడని మాత్రం ఊహించగలిగేడు గోపాలం.

"నా కొద్దురా" అన్నాడు సుబ్బడు.

సుబ్బడు ఎందుకొద్దన్నాడో గోపాలానికి తెలుసు.

బటానీలు పుచ్చుకొంటే బస్సు ఎక్కడ ఇవ్వవలసి వస్తుందోనని సుబ్బడి భయం.

"ఎవడిక్కావాలీ వీడి బస్సు!" అనుకొన్నాడు గోపాలం.

అయితే,

సుబ్బడి బస్సూ అంటే అక్కర్లేదు కాని, అటువంటి బస్సు కావాలనే ఉంది గోపాలానికి. కావాలని ఉన్నప్పటికీ తనకోసమే అయితే ఇంట్లో అంత గోల చెయ్యకపోను.

కాని తమ్ముడికి కావాలి ఆ బస్సు.

అందుచేతనంటే అందుచేతనే అటువంటి బొమ్మకోసం ఇంట్లో తెగ గోల చేసేడు. గోలచేస్తే నాన్న తిట్టేడు; అమ్మ కొట్టింది. అమ్మ తిట్టింది; నాన్న కొట్టేడు.

ఆ సంగతి సుబ్బడికి ఎక్కడ తెలిసిపోతుందోననే భయం కలగడం చేత గోల చెయ్యడం ఆపుచేసేడు గోపాలం.

కాని, తమ్ముడికక్కాడు వాలి ఆ బొమ్మ. మాటి మాటికీ "బచ్చు బచ్చు" అంటూనే ఉన్నాడు.

తమ్ముడికేదో జబ్బు ఉందని గోపాలానికి తెలుసు. అందరి పిల్లలూ నవ్వుతారు. తమ్ముడు మాత్రం నవ్వడు. కాని మొన్న ఆ బొమ్మ చూసినప్పుడు నవ్వేడే! అయితే తమ్ముడి జబ్బు పోతుంది కాబోలు. బొమ్మ ఇస్తే పోతుంది. సుబ్బడు ఇవ్వడు. ఇంట్లో నాన్న కొనడు.

గోపాలం తర్కం, గోపాలం బాధా కూడా ఎవ్వరికీ తెలీదు.

తమ్ముడు మాత్రం తెలివి ఉన్నప్పుడల్లా "బచ్చు బచ్చు" అంటూనే ఉన్నాడు.

చివరికి వాళ్ళమ్మకి విసుగెత్తి ఆ రోజు సాయంకాలం, "ఒరే గోపాలం, ఆ సుబ్బణ్ణడిగి ఆ 'బచ్చుట బచ్చు' దాన్నోసారి పట్రారా" అంది.

అభిమానాన్నీ పౌరుషాన్నీ చంపుకొని, తమ్ముడికోసం ఆ సుబ్బడి దగ్గరికి వెళ్దామనుకొనే నిశ్చయానికి అంతకుముందే వచ్చేడు గోపాలం. ఎందుకోగాని నిశ్చయాన్ని కార్యరూపంలో పెట్టలేకపోతున్నాడు.

అమ్మ ఆజ్ఞ ఆఖరికి గోపాలాన్ని ముందుకు తోసింది.

గోపాలం రావడం సుబ్బడు చూసుకోలేదు. చూసి ఉన్నట్లయితే బొమ్మని ప్రత్యేకం ఇంట్లో ఎక్కడో దాచకపోయినా, చేతిలో మాత్రం ఉంచుకోకపోను. దురదృష్ట వశాత్తూ సుబ్బడి చేతిలో బొమ్మ ఉండగా వచ్చేసేడు గోపాలం.

వస్తూనే అడగవలసిందేదో అడిగేసేడు గోపాలం.

"తమ్ముడు ఏడుస్తున్నాడూ. ఒక్కసారి 'బొంబాయి బస్సుని మా అమ్మ ఇమ్మందిరా" అన్నాడు తనమాట సుబ్బడు నమ్మడేమోనని,

"కావలిస్తే మా అమ్మనొచ్చి అడుగు" అని కలిపేడు.

గోపాలం అకస్మాత్తుగా వచ్చి అలా చెప్పడంవల్ల ఏమాలోచించడానికీ సుబ్బడికి అవకాశం లేకపోయింది. అందుచేత ఇంటిదగ్గర్నుంచి బొమ్మ పట్టుకొని, వేపచెట్టు వగకూ కిమ్మనకుండా వచ్చేడు. అక్కడికి వచ్చే లోపున ఏదో ఒక నిశ్చయానికి వచ్చినట్టుగా టక్కున ఆగేడు.

ఆగి "రేపు తెస్తానని చెప్పరా" అన్నాడు.

*　　*　　*　　*　　*

అందుకే ఆఖరిసారి అడిగినట్టుగా మళ్ళీ అడిగేడు గోపాలం.

"అయితే ఇవ్వవు కదరా" అని.

వేపచెట్టు బరువుగా ఊగింది. గాలికి ఎండుటాకులు గలగల్లాడుతూ దొర్లేయి. దగ్గిర దుకాణంలో కుట్టుమిషీను గరగర లాడింది. దుకాణంలో కూర్చొని కాజాలు కుట్టే పదిహేనేళ్ళ కుర్రవాడు ఏది ఉందో, ఏది లేకో, ఎవరికోసమో, ఎందుకో పడే బాధనంతా కంఠంలోకి తెచ్చుకొని పాటతో పోగొట్టుకొంటున్నాడు. చప్టామీద పడుక్కున్న ముసలాయన మధ్య మధ్య దగ్గడం మర్చిపోతున్నాడు.

జవాబు చెప్పకుండా నిల్చున్నాడు సుబ్బడు.

గోపాలం కోపంతో బాధతో వణికిపోతున్నాడని సుబ్బడికి తెలియడంలేదు.

సుబ్బడు గుక్కిళ్ళు మింగుతున్నాడు. బొమ్మని ఇవ్వాలనీ ఉంది. ఇవ్వడానికి ఇష్టంలేకుండా ఉంది.

"తమ్ముడు ఏడుస్తున్నాడు ...అమ్మ అడగమంది...లేపోతే ఎవడిక్కావాలి... నీ వెధవబుస్సు" అని మాటలు విరుస్తూ అన్నాడు గోపాలం.

ఎర్రసుబ్బడు ఎర్రబడ్డం చీకట్లో స్పష్టంగా తెలియడంలేదు. ముఖం అమ్మవారి గుడివైపు తిప్పుతున్నాడు. గుళ్లో నూనెదీపం అతని కళ్ళల్లో రెండుగా చీలింది.

"రేపు నే తెస్తారా...మా బావా, మరొచ్చి మా అక్కా రేపెళ్ళిపోతార్రా...అప్పుడు నే పట్టుకొస్తా కదూ" అన్నాడు సుబ్బడు.

బొమ్మను ఇవ్వడానికీ, బావా అక్కా వెళ్ళిపోడానికీ గల సంబంధం గోపాలానికి అర్థం కాలేదు. కోపంతో పళ్లు బిగించి ఊపిరి త్వరత్వరగా తీస్తూ విడుస్తూ, ముత్యం మూడోసారిగా మళ్లీ అడిగేడు.

నూనెదీపం కదుల్తోంది. సుబ్బడి గుండెలు త్వరితంగా కొట్టుకుంటు న్నాయి. సుబ్బడు తటపటాయిస్తూ నిల్చున్నాడు. సెకన్లు నడిచిపోతు న్నాయనీ, నల్లగోపాలం అగ్గిసెగలా దహించుకుపోతున్నాడనీ తెలుసుకో కుండా ఉన్నాడు.

చివరికి తటాల్న నూనెదీపంనుంచి దృష్టి ఇటువైపు మరల్చి "ఇందరా" అన్నాడు.

దుకాణంలో పడుచువాడు పాట ముగించేడు. కుట్టుమిషీను గరగర లాడ్డం మొదలుపెట్టింది. ముసలాయన దగ్గిదగ్గి "హామ్మయ్యా" అని ఆయాసం తీర్చుకున్నాడు. గాలికి ఎండుటాకులు గలగల్లాడుతూ చెదిరిచెదిరి పోయేయి.

"ఇందరా" అని సుబ్బడు అన్నాడే కాని పుచ్చుకోడానికి గోపాలం అక్కడలేడు. ఏ నాడో వెళ్ళిపోయేడు.

మర్నాడు—

ఉదయం ఆలస్యంగా లేచేడు సుబ్బడు. అందుచేతనో మరెందుచేతనో గోపాలంవాళ్ళ ఇంటికి ఉదయం వెళ్ళలేదు. తిన్నగా స్కూలుకే వెళ్ళిపోయేడు. వెళ్ళేసరికి బాగా ఆలస్యం అయింది. క్లాసులో అటూఇటూ పచారు చేస్తూన్న 'మాస్టారు' సుబ్బణ్ని చూసి ఆగి,

"ఏరా, సుబ్బారావూ, ఏడ్రా నీ నేస్తం?" అని అడిగేడు.

సుబ్బడికి తెలీదు.

"కలిసి రావడం మానీసేరేంరా?"

సుబ్బడు చెప్పలేదు.

"దెబ్బలాడుకున్నారట్రా?"

"లేదండీ."

అనేశాడే కాని సుబ్బడి మనసు పీకుతోంది.

ఆ రోజు గోపాలం బడికి రానేలేదు.

సాయంకాలం అయిదున్నర గంటలకి చేత్తో బొంబాయి బస్సు పట్టుకొని వేపచెట్టు దాటేడు సుబ్బడు. ఏదో నేరం చేసినవాడిముఖంలా ముఖం అంతా వాడింది. బరువుగా పడుతోంది అడుగు.

గోపాలం ఇంటిముందు, పెంటకుప్ప పక్కన నిల్చొని, ముగ్గురు పిల్లలు వీధిలోంచి ఇంటోకి తొంగి తొంగి చూస్తున్నారు. ఇద్దరివి, ఎర్రగళ్ళ లాల్చీలు; ఖాకీ నిక్కర్లు. ఒకడికి నిక్కరే ఉందికాని చొక్కా లేదు. ముగ్గురి చేతుల్లోనూ తాళ్ళూ బొంగరాలూ ఉన్నాయి. వాళ్ళకీ ఆ ఇంట్లోకి వెళ్ళాలనీ ఉన్నట్టుగా ఉంది. కాని ఎందుకో భయపడుతూన్నట్టుగా ఉన్నారు. వాళ్ళ చూపులూ, వాళ్ళ గుస గుసలూ, మొత్తంమీద వాళ్ళ ప్రవర్తనా చూస్తే సుబ్బడికి ఎందుకోగాని భయం కలిగింది. గుండెలు బరువెక్కేయి. జోరుగా నడుద్దామనుకుంటే అడుగు మాత్రం తేలిగ్గా పడ్డంలేదు. చేతిలో ఉన్న బొంబాయి బస్సు నెత్తిమీద కొండలా ఉంది.

“ఏంరా, గోపాలం లేడూ?” అని కొంచెం బెక్కుతూ అడిగేడు వెళ్తూనే.

ముగ్గురు పిల్లలూ గుడ్లు పెద్దవి చేసేరు.

వాళ్ళల్లో చొక్కా లేనివాడు దొంగ బాచిగాడు—“ఇస్! నీకు తెల్దట్రా?” అని ఆశ్చర్యంగా అన్నాడు. ప్రమాదకరమైనది, ముఖ్యమైనది, ఆ సమయానికి ఎంతో గొప్పదైన వార్త చెప్పబోయే ఆత్రత కనిపిస్తోంది బాచిగాడి ముఖంలో.

ముగ్గురు పిల్లలూ స్వరాలు బాగా తగ్గించి, మాటల్ని జోరుగా దొర్లించి సంగతి ఏమిటో వివరంగా చెప్పేరు, చెప్పేక.

“అర్రె! నువ్వెళ్ళకరా బాబూ! ఎవురూ ఎళ్ళకూడదట. మావోళ్లు చెప్పేరు” అని ఒక ఎర్రగళ్ల చొక్కా వాడు గొంతుక తగ్గించి గోలపెట్టాడు.

ఆ మాటలు సుబ్బడికి వినిపించ నేలేదు. తొందరగా గుమ్మంలోంచి రెండు మెట్లు దిగి ముందు గదిలోకి వెళ్ళేడు.

గదిలో ఓ వారకి గోడకి ఓ పాత సైకిలు చేరవేసి ఉంది. దానికి ఇవతలగా, ఒక తడిసి ఎండిన చాపమీద తలకింద చెయ్యి పెట్టుకొని ఒక పక్కకి తిరిగి పడుకొంది గోపాలం తల్లి. తడిసి ఆరని జుట్టంతా ఆమె

వంటిమీదా చాపమీదా పడుతోంది. శుష్కించిపోయిన ఓ ముసలావిడా, మోటాగా ఉన్న ఒక నడివయసు ఆడమనిషీ ఆమె తల దగ్గర కూర్చొని నెమ్మదిగా ఏదో మాట్లాడుతున్నారు.

గుమ్మంలోంచే గదంతా కలయజూసి తిన్నగా వెనక గదిలోకి వెళ్ళేడు సుబ్బడు.

వెనక గదికి కిటికీల్లేవు. గదినిండా నీడలు పడగలు విప్పుకొని ఉన్నాయి. చీకట్లో అడవిలాగ సామానంతా అస్పష్టంగా కనిపిస్తోంది. ఎడమవైపుకి ఎత్తుగా భూతంలా నిల్చొంది పందిరి మంచం.

నీడల్లో మునిగిపోయేడు సుబ్బడు.

కొద్దిసేపట్లో, ముందుగదిలో కూర్చొన్న ముసలావిడ "అయ్యో, పిల్లడు ఏడుస్తున్నాడమ్మా" అంది.

ఎక్కడో ఏదో లోకంలో పాతుకుపోయినట్టుగా ఉన్న గోపాలం తల్లి మెల్లిగా కదిలి లేవబోతోంటే, "నువ్వుండమ్మా! నే వెళ్ళి సముదాయిస్తా" అని శుష్కించిపోయిన ఆ ముసలావిడే గుమ్మందాటి వెనకగదిలోకి వెళ్ళింది.

పందిరి మంచానికి పక్కగా, నేలమీద కూర్చొని, ఓ మేకుతో గచ్చుని బద్దల్చేస్తున్నాడు గోపాలం. వంచిన తల పాముల బుట్టలా ఉంది. అడుగు పెదవి కోరలకింద నొక్కుకుపోతోంది.

ఎదురుగా నిల్చున్నాడు ఎర్రసుబ్బడు.

కొన్ని వస్తువులు మనుష్యుల్ని వేరుచేస్తాయి.

కొన్ని పరిస్థితులు మనుష్యుల్ని దగ్గరగా తీసుకొస్తాయి.

ఒకప్పుడు నలుపు నిగనిగ మెరుస్తోంది. ఒకప్పుడు ఎండ చల్లగా ఉంటుంది. "నిన్ను అంటుం అంటుం" అనేటి నక్షత్రాలే ఒకప్పుడు జారి కిందకి దిగి భూమిని అందుకొంటాయి.

ఎర్రసుబ్బడు చెప్పేమాటలు గదిలోకి వచ్చిన ముసలావిడకి సరిగా అర్థంకాలేదు. కాని, గోపాలానికి స్పష్టంగా వినిపిస్తున్నాయి, తెలుస్తున్నాయి.

గోపాలాన్ని, బొంబాయి బస్సు తీసుకోమంటున్నాడు ఎర్రసుబ్బడు.

"అచ్చంగా, అచ్చంగా తీసుకోరా! నాకొద్దురా ఇదీ" అంటూ చెయ్యి జాచి ఇస్తున్నాడు బొంబాయి బస్సుని.

గోపాలం కన్నెత్తలేదు, తలెత్తలేదు.

సుబ్బడికి అక్కర్లేదట ఆ బస్సు.

గోపాలానికూడా అక్కరలేదు.

కావాలన్నది తమ్ముడు.

కావాలన్న తమ్ముడు ఏడీ? ఏడీ?

బొంబాయి బస్సూ అక్కరలేదు; సుబ్బడి సానుభూతీ అక్కరలేదు గోపాలానికి.

సుబ్బడికి అర్థం అవుతోంది గోపాలానికి ఎందుకంత కోపంగా ఉందో. అందుకే,—

"మనవాడు కాదే. అల్లవాళ్ళ ఎర్రసుబ్బడు ఏడుస్తున్నాడు."

అనవలసివచ్చింది ముందుగదిలో చాపదగ్గర తిరిగి కూర్చొన్న ముసలావిడ.

~~~*~~~
~~~